సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

క్లుప్తంగా

బాక్సు కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన



మాదేటి గార్డెన్స్‌లో పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు మాదేటి గార్డెన్స్‌లోని గౌరీ కల్యాణ మండపం వెనుక రోడ్డులో సుమారు రూ.9 లక్షలతో బాక్సు కల్వర్టు నిర్మించనున్నారు. గురువారం ఉదయం కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

19న స్కంద షష్ఠి



సుబ్రహ్మణ్యస్వామి

కంచరపాలెం: ఈ నెల 19న కార్తీక మాస శుద్ధ స్కంద షష్ఠి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శరవణ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 5 గంటలకు కలశ స్థాపన, గోక్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, పన్నీరు, చందన, అన్నాభిషేకాలు చేస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దేవాల రాజు(కృష్ణ) తెలిపారు. సాయంత్రం 5 గంటలకు వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం జరుగుతుందన్నారు. భక్తులు తిలకించి తరలించాలని ఆయన కోరారు.

అయ్యప్ప సేవా పీఠం అన్నదానం



అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ గోవింద్

సీతంపేట: శబరిమలలో అయ్యప్ప ఆలయం తెరిచిన సందర్భంగా సీతంపేట గణేష్‌నగర్‌లో అయ్యప్ప సేవా పీఠం ఆధ్వర్యంలో గురువారం స్వామివారికి పంచామృతాభిషేకం, పుష్పార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం సుమారు 2 వేల మందికి అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, కాపు సంఘం అధ్యక్షులు గుంటూరు నరసింహమూర్తి, లింగం శ్రీను, వేణు, సుదర్శన్ పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కె.కె.రాజు, సంఘ సభ్యులు

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు మర్రిపాలెం పరిధి మహారాణి వీధిలో జైభీమ్ జైశ్రీరామ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం గౌరీపరమేశ్వరుల నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు గౌరీపరమేశ్వరులను దర్శించుకున్నారు. ముందుగా ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చారు. కార్యక్రమంలో వార్డు నాయకులు చిరంజీవి, అచ్యుతరావు, వెంకటేష్, ప్రసాద్, రమేష్, కృష్ణ, నాగరాజు, దంతు, హరినాథ్‌రెడ్డి, శంకర్, గౌరీప్రసాద్, కైలాస్, శివ, పైడిరాజు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ నార్త్
8309817091

మార్కెట్‌కు చవితి శోభ

- నాగుల చవితికి సర్వం సిద్ధం
- జోరుగా పూజా సామగ్రి విక్రయాలు



కంచరపాలెం రైతుబజార్‌లో విక్రయిస్తున్న పూజా సామగ్రి



కంచరపాలెం కూడలిలో నాగుల చవితి పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న జనం

కంచరపాలెం: నాగుల చవితి సందర్భంగా గురువారం రైతుబజార్లు, మార్కెట్లు వినియోగదారులతో కళకళలాడాయి. కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, మర్రిపాలెం, తాటిచెట్లపాలెం, జ్ఞానాపురం తదితర ప్రాంతాల్లో నాగుల చవితి పూజా సామగ్రి విక్రయాలు జోరుగా సాగాయి. శుక్రవారం జరగనున్న నాగుల చవితి పూజలకు కంచరపాలెంలో పుట్టలు సిద్ధం చేశారు. కొబ్బరికాయలు, అరటిపండ్లు, పూలు, పత్రి, నూలు, తాటిటెంకలు తదితర సామగ్రికి డిమాండ్ ఉండటంతో వ్యాపారులు అధిక ధరలకు విక్రయించారు. కంచరపాలెం రైతుబజార్‌లో వీటి ధరలు కాస్తా చౌకగా ఉండటంతో వినియోగదారులు భారీగా కొనుగోలు చేశారు. కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారికి ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు వేయడంతో వాటిని ఫ్లైఓవర్ వంతెనపైకి తరలించారు. సాయంత్రం రహదారులు వినియోగదారులు, వ్యాపారులతో రద్దీగా మారాయి. కంచరపాలెం ఐదో పట్టణ ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు నేతృత్వంలో సిబ్బంది వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకున్నారు.

కిటకిటలాడిన సీతమ్మధార రైతుబజార్

సీతమ్మధార: నాగుల చవితి పూజా సామగ్రి కొనుగోళ్లతో గురువారం సీతమ్మధార రైతుబజార్ కిటకిటలాడింది. అధిక సంఖ్యలో వినియోగదారుల రాకతో సందడి నెలకొంది. పండ్లు, కొబ్బరికాయలు, ఆకు, చెక్కలు, చెరుకుగడ, పసుపు, కుంకుమ, పువ్వులు, నిమ్మకాయలు, గుమ్మడికాయతో పాటు ఇతర సామగ్రి భారీగా కొనుగోలు చేశారు.



రైతుబజార్‌లో వినియోగదారుల రద్దీ

జేబు దొంగతనాలు జరగకుండా రైతుబజార్ ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్ సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించారు.

కనుల పండువగా కలశ మహోత్సవం



కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాములు

సీతంపేట: పూర్ణ పుష్కల అయ్యప్ప సేవా ట్రస్టు, అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ ఆధ్వర్యంలో గురువారం కలశ మహోత్సవం వైభవంగా జరిగింది.

శబరిమలలో గురువారం అయ్యప్ప ఆలయం తెరిచిన సందర్భంగా ట్రస్టు చైర్మన్ పైలా ఆదిమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో మున్ మేల్ శాంతి ఎం.ఎస్.రేజి కుమార్ నంబూద్రి పాల్గొని పూజలు చేశారు. నరసింహనగర్‌లోని పూజా కోర్ కమిటీ చైర్మన్ ఎం.కృష్ణయ్య ఇంటి నుంచి అక్కయ్యపాలెం, దొండపర్తి, డైమండ్ పార్కు మీదుగా శంకరమఠం వరకు కలశ మహోత్సవ ఊరేగింపు కొనసాగింది.

వృత్తి విద్యా కోర్సులకు ఉచిత శిక్షణ

తాటిచెట్లపాలెం: జన శిక్షణ సంస్థాన్, వరల్డ్ టీచర్ ట్రస్ట్(జగద్గురు పీఠం) సంయుక్తంగా తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఈకే సంస్కృతి సదన్‌లో పలు వృత్తి విద్యా కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ప్రారంభిస్తున్నట్లు జగద్గురు పీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 45 ఏళ్ల వయసు గల మహిళలు అర్హులని చెప్పారు. ఈ నెల 22లోగా తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఈకే సంస్కృతి సదన్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల లోపు తమ పేర్లు, వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. కంప్యూటర్ కోర్సు(3 నెలలు), హ్యాండ్ ఎంబ్రాయిడరీ(3 నెలలు), బ్యూటీషియన్ (3 నెలలు) వంటి కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. వీటిని విజయవంతంగా పూర్తిచేసుకున్న వారికి పరీక్షలు నిర్వహించి, భారత ప్రభుత్వం ద్వారా గుర్తింపబడిన సర్టిఫికెట్లు అందజేయనున్నామని సత్యదేవ్ తెలిపారు.

రైతుబజార్ స్టాళ్లకు డ్రా



స్టాల్ టోకెన్ అందిస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లోని స్టాళ్లకు గురువారం ఈవో కొండబాబు ఆధ్వర్యంలో డ్రా తీసి రైతులకు టోకెన్లు అందజేశారు. కార్యక్రమంలో సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

రామాయణంపై క్విజ్



క్విజ్ పోటీ విజేతలతో నిర్వాహకులు

సీతంపేట: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విశాఖ పౌర గ్రంథాలయం, విశాఖ సాహితి, అఖిల భారతీయ సాహిత్య పరిషత్ సంయుక్త నిర్వహణలో గురువారం ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీలో రామాయణంపై క్విజ్ పోటీ నిర్వహించారు. డాక్టర్ డి.వి. సూర్యారావు క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు. ఈ పోటీలో 11 టీమ్‌లు పాల్గొన్నాయి. విశాఖ సాహితి ఉపాధ్యక్షురాలు కందాళ కనకమహాలక్ష్మి మాట్లాడుతూ ఇటువంటి పోటీలు యువతలో రామాయణ, మహాభారత గ్రంథాలపై అవగాహన వస్తుందన్నారు. అఖిల భారతీయ సాహిత్య పరిషత్ కార్యదర్శి శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ జ్ఞానార్థులకు గ్రంథాలయాలు జ్ఞాన కాంతిని పంచే సూర్యుడు వంటివని, గ్రంథాలయంలో అడుగుపెడితే ప్రపంచమంతా కనుల ముందు ఉన్నట్టేనన్నారు. డి.వి.సూర్యారావు మాట్లాడుతూ యువత సాహిత్యంలో ఆసక్తి చూపి మన భాషకు మేలు చేయాలన్నారు. అనంతరం పోటీ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకులు దుర్గారాణి, విద్యార్థులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

మురళీనగర్: మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం గ్రంథాలయ ఉద్యమ నేతలు గాడిచర్ల హరి సర్వోత్తమరావు, అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్ రంగనాథన పాతూరి నాగభూషణంకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ వై.పద్మజ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మన ఆరోగ్యం–పరిశుభ్రత, ఆన్‌లైన్ తరగతులు లాభనష్టాలు వంటి అంశాలపై పోటీలు జరిగాయి. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగి ఎంవీ భాస్కరరావు, టీచర్ ఎస్.శశికళ, పాఠకులు తిరుమలరావు, రాజు, దుర్గమ్మ పాల్గొన్నారు.



వక్తృత్వ పోటీలో మాట్లాడుతున్న విద్యార్థిని

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



జగదీష్ మృతదేహం

గోపాలపట్నం: మనస్తాపంతో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన శివనగర్‌లో జరిగింది. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీవీఎంసీ 53వ వార్డు శివనగర్‌లో గంటాల జగదీష్(52) అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తలుపులు గడియ వేసుకుని ఫ్యాను హుక్‌కు ఉరి వేసుకుని మృతిచెందాడు. కొద్దిసేపటి తరువాత కుటుంబ సభ్యులు గమనించి తలుపులు తెరిచి చూశారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు సివిల్ కాంట్రాక్ట్ వర్క్స్ చేసేవాడు. పనుల నిమిత్తం హైదరాబాద్ వెళ్లి ఇటీవలే తిరిగొచ్చాడు. 15 రోజుల కిందటే శివనగర్‌లోని అద్దె ఇంట్లోకి మారారు. అప్పటి నుంచి ఇంట్లో ముభావంగా ఉండేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. జగదీష్ మృతికి ఆర్థిక ఇబ్బందులు కారణమై ఉండొచ్చని చెబుతున్నారు. మృతుడికి భార్య శ్రీదేవి, ఇద్దరు కుమార్తెలు పూజిత, వికాసిని ఉన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఎస్ఎఫ్ఎస్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

బీచ్ రోడ్డు: జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. రామ్‌నగర్‌లోని లయన్స్ క్లబ్‌లో ఈ నెల ఒకటి నుంచి 14 వరకు నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఫలితాలను గురువారం వెల్లడించారు. ఎస్ఎఫ్ఎస్ విద్యార్థులు కృత్రిమ మేధస్సుతో రూపొందించిన చంద్రయాన్–3 నమూనా సందర్శకులను అమితంగా ఆకర్షించడంతో ప్రథమ బహుమతి పొందింది. ఈ సందర్భంగా విద్యార్థులను స్కూల్ ప్రిన్సిపాల్ విజయకుమార్ అభినందించారు.



ఎస్ఎఫ్ఎస్ స్కూల్ విద్యార్థులకు బహుమతి అందిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

రూ.10 భోజనానికి 200 రోజులు

మహారాణిపేట : రౌండ్ టేబుల్ సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీ స్వామి వివేకానంద సంస్థ సహకారంతో ప్రభుత్వ ప్రసూతి (ఘోష) ఆస్పత్రిలో రోగులు, వారి సహాయకులకు పది రూపాయలకే భోజనాలు అందించే కార్యక్రమం నేటికి 200 రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా రౌండ్ టేబుల్ సంస్థ సభ్యులు మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు, వారి సహాయకులకు నారాయణ సేవ చేయాలనే ఉద్దేశంతో ప్రతి రోజు పది రూపాయలకే భోజనాలు అందిస్తున్నామన్నారు. రౌండ్ టేబుల్ సభ్యులు విక్రాంత్ హనుమంతు, సందీప్ రెడ్డి, మక్సూద్ అహ్మద్, కల్యాణ్ ఆదిత్య, విరాజ్ పోలిశెట్టి, అరవిందు, రవి నల్లమోతు, భారత్ కొల్లపూడి, వివేకానంద సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రూ.10 భోజనాలు అందజేస్తున్న సంస్థ సభ్యులు

షాదీఖానా, ఈద్గా నిర్మాణానికి వినతి



స్టేట్ మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ముస్లిం నాయకులు

మహారాణిపేట: రాష్ట్రంలో ప్రతి జిల్లా, మండలానికి షాదీఖానా, ఈద్గా, ఉర్దూ రెసిడెన్షియల్ స్కూలు, కాలేజీ ఏర్పాటు చేసి, ఉర్దూ టీచర్ల నియామకం చేయాలని నూర్ బాష ముస్లిం నాయకులు కోరారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఏపీ స్టేట్ మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్‌ఖాన్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూర్ బాష ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ షేక్ బాబ్జీ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం సమర్పించారు. ముస్లిం శ్మశాన వాటికి కోసం ఒక ఎకరం నుంచి రెండెకరాల వరకు స్థలం మంజూరు చేసి, ప్రభుత్వ నిధులతో ప్రహరీ నిర్మించాలని కోరారు. మసీదులకు ప్రభుత్వ సబ్సిడీతో విద్యుత్, మంచి నీటి సదుపాయం కల్పించాలన్నారు. 11 డిమాండ్లతో వినతిపత్రం సమర్పించారు. కమిషన్‌ను కలిసిన వారిలో రాష్ట్ర మహిళా గౌరవ అధ్యక్షురాలు షేక్ మున్నీ, షేక్ నాగూర్, షేక్ మదీనా తదితరులున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

సీతమ్మధార: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 50వ వార్డు వుడా కాలనీ సచివాలయం (1086294) పరిధి మాధవధార, మురళీనగర్ ప్రాంతాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ఇప్పటి వరకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలపై వివరిస్తూ, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు, చివరి లబ్ధిదారుడి వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరాలని సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో గడప గడపకు మన ప్రభుత్వం చేపట్టారన్నారు. ప్రజల సమస్యలను నేరుగా ప్రజాప్రతినిధులు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం పూర్తయిన సందర్భంగా వార్డు పార్టీ కార్యాలయంలో కేక్ కట్‌చేసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారావు మాస్టార్, వార్డు అధ్యక్షురాలు పప్పల సునీత, డైరెక్టర్ పైడి శ్రీను, జిల్లా జనరల్ సెక్రటరీ ఎం.లక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, వార్డు నాయకులు భగాతి విజయ్, ఎ.వి.ఎస్.రాజు, సబ్బవరపు శ్రీను, పొన్నాడ అప్పారావు మాస్టార్, నారాయణరావు, నారాయణ స్వామి, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రూ.16 లక్షలతో రహదారి పనులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ మసీదు రోడ్డులో రహదారి నిర్మాణ పనులకు గురువారం అధికారులతో కలిసి కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. మసీదు రోడ్‌లో రహదారులను పునర్నిర్మించేందుకు సుమారు రూ.16 లక్షల నిధులు మంజూరైనట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఏఈ రమణమ్మ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు షేక్ జుబేర్, కో ఆప్షన్ సభ్యుడు షరీఫ్, మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్, పార్టీ నాయకులు ఆళ్ల శ్రీనివాసరావు, ఎస్.ప్రసాదరావు, నాగమణి పాల్గొన్నారు.



మసీదు రోడ్డులో శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ ఆళ్ల లీలావతి

బ్యాంకు ఉద్యోగుల నిరసన



యూనియన్ బ్యాంక్ సీతమ్మధార బ్రాంచ్ వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

సీతమ్మధార: ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ పిలుపు మేరకు విశాఖ జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ సంఘం ఆధ్వర్యంలో గురువారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీతమ్మధార బ్రాంచ్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ కార్యదర్శి ఆర్.వసంతరావు మాట్లాడుతూ అన్నీ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకుల్లో అనుసరిస్తున్న ఔట్ సోర్సింగ్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నామని, కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే డిసెంబర్ మొదటి వారంలో విడతల వారీగా సమ్మె చేస్తామని హెచ్చరించారు. 2024 ఫిబ్రవరిలో దేశ వ్యాప్త సమ్మె చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వడాల రమణ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్న బ్యాంకింగ్ సెక్టార్‌ను నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మహీంద్రా, కమలాకర్, రమేష్, శ్రీనివాస్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల ప్రయోజనాలు కాపాడాలి

మురళీనగర్: పెన్షనర్ల ప్రయోజనాలు కాపాడేలా ఈపీఎఫ్ పథకాన్ని సమీక్షించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మర్రిపాలెంలోని ఈపీఎఫ్ రీజినల్ కార్యాలయం వద్ద ఈపీఎఫ్ 95 పెన్షనర్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.దీనబంధు మాట్లాడుతూ ప్రతి ఐదేళ్లకోసారి పథకాన్ని సమీక్షించి కార్మికుల ప్రయోజనాలు కాపాడుతామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. ఈ పథకాన్ని ప్రవేశపెట్టి 28 ఏళ్లు గడిచినప్పటికీ పెన్షనర్లకు కనీసం ప్రయోజనాలు రాలేదని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే హుస్సేన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ 40 లక్షల మంది రూ.వెయ్యి నుంచి రూ.2,500 లోపే పింఛన్ పొందుతున్నారని చెప్పారు. జీవిత భాగస్వామి పెన్షన్ అమ్ముకునే హక్కును తొగించడం అమానుషమన్నారు. కనీస పింఛన్ రూ.9 వేలు చెల్లిస్తూ పెరిగిన డీఏకు అనుసంధానించాలని, భార్యాభర్తలకు వైద్య సదుపాయం కల్పించాలని, రైల్వే రాయితీలు పునరుద్ధరించాలని, అర్హులందరికీ హయ్యర్ పెన్షన్ చెల్లించాలని అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. పలువురు నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

ట్రాఫిక్ నియంత్రణకు మైక్‌సెట్ ఉపయోగకరం

కంచరపాలెం: ట్రాఫిక్ నియమాలు పాటించి రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా ఉండాలని జోన్–2 ట్రాఫిక్ ఏసీపీ జి.రాజీవ్‌కుమార్ అన్నారు. కంచరపాలెం వై జంక్షన్ నేతాజీ వంతెన వద్ద గల పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్‌కు గురువారం 56వ వార్డు గవర కంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘానికి చెందిన పెంటకోట నూకరాజు మైక్‌సెట్ వితరణ చేశారు. దీనిని ముఖ్య అతిథిగా ఏసీపీ ప్రారంభించి మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణకు మైక్‌సెట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు, ఎస్ఐలు వాసుదేవరావు, పాపారావు ఉల్లాక్, సంఘ అధ్యక్షుడు వెంకటరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆడారి శ్రీను, కొణతాల నర్సింగరావు, మాజీ అధ్యక్షుడు మళ్ల శంకరరావు, బలరామ్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.



మైక్‌సెట్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్

పిల్లల్లో నేత్ర సమస్యలపై అవగాహన అవసరం

ఆరిలోవ: ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో బాలల నేత్ర సంరక్షణ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 19వ తేదీ వరకు జరగనున్నట్లు ఆస్పతి కంటి వైద్య నిపుణుడు డాక్టర్ స్నేహాల్ గణత్ర తెలిపారు. ఈ మేరకు గురువారం పిల్లల తల్లిదండ్రులకు ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో మయోపియా(హ్రస్వ దృష్టి), హైపర్ మెట్రోఫియర్(దూరదృష్టి), అస్టిగ్మాటిజం(ఒక వైపునకే దృష్టి సారించడం) తదితర సమస్యలు తలెత్తుతాయన్నారు. వీటి వల్ల పిల్లలు రోజువారీ పనులు చేసేటప్పుడు ఇబ్బందిపడుతుంటారన్నారు. చదువుతున్నప్పుడు తలనొప్పి, కళ్లకు అలసట రావడం జరుగుతుందన్నారు. అలాంటి వారిని వెంటనే కంటి వైద్యులకు చూపించాలని ఆయన సూచించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com